క్లుప్తంగా

అక్షర యోధునికి అశ్రు నివాళి

తెనాలిఅర్బన్: ఈనాడు దినపత్రిక వ్యవస్థాపకులు రామోజీరావు మృతి పట్ల బీజేపీ తెనాలి పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. రామోజీరావు అనేక సంస్థలను ఏర్పాటు చేసి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారని చెప్పారు. పత్రిక, సినీ, వ్యాపార రంగాల్లో రాణించి చరిత్ర సృష్టించారని కొనియాడారు. ఆయన లేని లోటు రాష్ట్రానికి తీర్చలేనిదన్నారు .ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు.

వసంత దుర్గకు నాటేశ్వర బిరుదు ప్రదానం



తెనాలిఅర్బన్: తెనాలి ఐతానగర్‌లోని శ్రీలక్ష్మీనారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ నిర్వాహకులు పెసర్లంక వసంత దుర్గకు నాటేశ్వర బిరుదును, ఆమె శిష్యులు భువన తేజస్విని తన్మయి, నిత్య నిహీరా, దీపిక, చైత్ర, కృతిక, ధన్విత, రోహిత, సాత్వికలకు నాట్యాంబ బిరుదుతో రాధా మాధవ రసరంజని వ్యవస్థాపక కార్యదర్శి షేక్ ఖలీల్ సత్కరించారు. అమరావతిలోని శ్రీ అమరేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో సోమవారం నృత్య మహోత్సవం జరిగింది. మహోత్సవంలో ప్రతిభ కనబరిచిన వీరికి అవార్డులు, మెమెంటో, ప్రశంస పత్రాలను అందజేసి సత్కరించినట్లు వసంత దుర్గ తెలిపారు. వీరికి అందెబాల చంద్రమౌళి, రాజేశ్వరి, అనిత, లక్ష్మిలు అభినందనలు తెలియజేశారు.

తెలుగు హనుమాన్ చాలీసా పారాయణం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం తెలుగు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రకాశ్‌శర్మ శిష్య భజన బృందం(ఎన్.టి.ఆర్.జిల్లా భద్రిరాజుపాలెం) 41 రోజు దీక్ష చేసి 41 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కీబోర్డుపై హమిరెడ్డి దుర్గాప్రసాద్, పాడ్స్‌పై రాజేష్ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని ఎంవీ రత్తయ్య, సుజాత దంపతులు నిర్వహించారు. అనంతరం ప్రకాశ్ శర్మ శిష్యబృందం, నిర్వాహకులను దేవాలయ పాలకవర్గం సత్కరించారు.

వైభవంగా పందిర్ల పండగ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో ఆదివారం సాయంత్రం పందిర్ల పండుగను వైభవంగా నిర్వహించారు. ఆలయం చుట్టూ సుందరంగా మూడు పందిర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక దివ్యపూజాబలి కార్యక్రమంలో బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఎం. ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేశారు. మన్నారు(దివ్యసత్ ప్రసాదం) దేవుడి యొక్క ఉనికిని తెలియజేస్తుందని చెప్పారు. మన్నాను తీసుకువెళితే విజయం చేకూరుతుందని ఇశ్రాయేల్ ప్రజలు భావించేవారన్నారు. ఏసు క్రీస్తు ప్రజల పాపాలను ప్రక్షాళన చేశారని చెప్పారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. దివ్యసత్ ప్రసాదాన్ని భక్తులకు చూపి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఫాదర్ విలియమ్స్, మఠకన్యలు, గుడిపెద్దలు, మరియదళ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

తాడేపల్లి రూరల్ : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం గ్రామంలో ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ కె. నాగేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిన బుల్లా అర్జున్ తేజ్ (543 మార్కులు), లాం షైనీ మధురిమ (530)లకు రూ.7 వేల చొప్పున విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయ సమాఖ్య బృందం ఆధ్వర్యంలో సహాయం అందించామని పేర్కొన్నారు. మరో 15 మంది విద్యార్థులకు రూ.6 వేల వంతున అందజేశామని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి విద్యార్థులు మరిన్ని శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. పులి రవి, డాక్టర్ ఎల్. రత్నకుమారి, బి. సంజయ్ కుమార్ (కెనడా), కె. రాజశేఖర్, కె. నవ్య (కెనడా), ఎల్. రవికుమార్, పి. లాజరు, బి. మరియదాసు, బి. సురేష్‌బాబు, బి. వెంకటేష్, ఎస్. కిషోర్, కె. ప్రవీణ్, కె. ఇమ్మానుయేల్ తదితర దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయ సమాఖ్య బృందం సభ్యులు, విన్సెంట్ డి పాల్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్
- పట్టణంలో కాలువల పూడికతీతకు అధికారులకు ఆదేశాలు



పాలాద్రి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్

తెనాలిఅర్బన్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని రోడ్లపైకి మురుగు రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. 11వ వార్డు పూలే కాలనీలో చివర ఉన్న పాలాద్రి కాలువను ఆదివారం ఆయన పరిశీలించారు. మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడాన్ని గమనించి వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. అలాగే తెనాలి పట్టణంలో ఉన్న పంట కాలువలోని పూడికతీత పనులు, తూటికాడ తొలగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలు, పంట కాలువల ప్రక్షాళనకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన పంట కాలువలను మరమ్మతులు చేయడంతో పాటు రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల వద్ద ఉన్న పాటి కాల్వ, చెంచుపేటలోని డ్రైనేజీ, శివారు ప్రాంతాల్లో ఉన్న కాలువలకు కూడా పూడికతీత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ముందుంటామన్నారు. త్వరలో ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి వీటిపై తగిన ఆదేశాలు ఇస్తామన్నారు. గురువయ్య కాలనీలోని స్మశానవాటిక తూర్పు వైపు ప్రహారీ గోడ లేకపోవడం వలన అంత్యక్రియల సమయంలో పిల్లలు భయాభ్రాంతులకు గురవుతున్నారని, గోడను నిర్మించాలని ఎమ్మెల్యేను స్థానికులు కోరారు. దీనిపై స్పందించిన ఆయన గోడను త్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే హోదాలో పర్యటనకు వచ్చిన ఆయనను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, కౌన్సిలర్ బోయపాటి అరుణ, డీఈలు నాగభూషణం, సుబ్బారావు, జనసేన నాయకులు హరిదాసు గౌరిశంకర్, బండారు రవికాంత్, దొడ్డక ఆదినారాయణ, రైతు సంఘం నాయకుడు ఈదర పూర్ణచంద్, మురళీకృష్ణ, పలువురు మున్సిపల్ ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

తెనాలిఅర్బన్: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రజక సంఘం నాయకుడు వల్లూరు లక్ష్మీపతి పేర్కొన్నారు. రజక వాలంటీర్ సర్వీస్ సొసైటీ 7వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యలో అందరూ ముందుడాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. రజకులు ఓటు బ్యాంక్‌గా ఉండకుండా చైతన్యవంతులు కావాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. రజక వలంటీర్ సర్వీస్ సొసైటీని స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన 80 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2వేలు చొప్పున ఉపకార వేతనాలు, కాలేజ్ బ్యాగ్‌లు, మెడల్స్, నోటు పుస్తకాలు, కుర్చీలు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. 24, 38వ వార్డు కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, వీర్లపాటి విజయలక్ష్మి, కొండవీటి శ్రీనివాసరావు, వరగాని ఏడుకొండలు సహకారంతో విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పోతర్లంక ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పెటేటి శ్రీనివాస్, నాయకులు నాంచారయ్య, వెంకటేశ్వరరావు, శివనాగేశ్వరరావు, పెసర్లంక రమణ, మహిళా ప్రతినిధులు చందలూరి లక్ష్మీదేవి, సునీత, శివనాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఆటా' సమావేశాల్లో సాయి లక్కరాజుకు సత్కారం



తెనాలి: అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) 18వ ద్వైవార్షిక సమావేశాల్లో తెనాలికి చెందిన స్వరలయ వేదిక సంస్థ వ్యవస్థాపకుడు, కవి, రచయిత, నటుడు, దర్శకుడు సాయి లక్కరాజుకు సత్కారం జరిగింది. అమెరికాలోని జార్జియా రాష్ట్రంలోని అట్లాంటాలో జూన్ 7,8,9 తేదీల్లో ఈ సమావేశాలు జరిగాయి. 8వ తేదీన సాయంత్రం 'విభిన్న స్వరాల వేదిక' పేరుతో జరిగిన మూడో సెషన్‌లో కీలకోపన్యాసం చేసిన సాయి లక్కరాజును నిర్వాహకులు రవి, తెలంగాణకు చెందిన ప్రముఖ కవి నందినీ సిద్ధారెడ్డి సత్కరించారు. ఈ వేడుకలో ప్రముఖ కవి అఫ్సర్ పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంఘం కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షురాలిగా రంగస్థల నటీమణి బుర్రా జయలక్ష్మి ఏకగ్రీవ ఎన్నిక
- అప్పటికప్పుడే ప్రమాణ స్వీకారం
- ప్రస్తుత అధ్యక్షుడి ప్రమేయం లేకుండానే ఎన్నికలు
- కొందరు వ్యతిరేకించడంతో వాగ్వాదం, ఉద్రిక్తత



సంఘ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



కళాకారుల సంఘ సమావేశంలో వాగ్వాదం

తెనాలి: పట్టణ రంగస్థల కళాకారుల సంఘం నూతన అధ్యక్షురాలిగా ప్రముఖ రంగస్థల నటీమణి బుర్రా జయలక్ష్మి ఎన్నికయ్యారు. కళాకారుల సంఘ భవనంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు అధ్యక్షత వహించగా, ఎన్నికల అధికారిగా డీఎల్ కాంతారావు వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా ఆరాధ్యుల కోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గరికపాటి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ఆరాధ్యుల ఆదినారాయణరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.రామలింగేశ్వరరావు, కోశాధికారిగా దీపాల సుబ్రహ్మణ్యాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బెజ్జంకి నాగమణి, నిర్మలా రమేష్, పందిటి సుబ్బారావు, శరత్ వెంకయ్య, ముత్యాల లక్ష్మీతులసి, సంయుక్త కార్యదర్శులుగా కనపర్తి మధుకర్, గోగినేని సుధీర్, మహబూబ్ సుభాని, కార్యవర్గ సభ్యులుగా బడుగు మోహనరావు, గోళ్ల సుబ్రహ్మణ్యం, కొండముది రమేష్, ఎస్‌కే సైదా, వేములవాడ సత్యవతి ఎన్నికయ్యారు. క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, చెరుకుమల్లి సింగారావు, షేక్ జానిబాషా, న్యాయ సలహాదారుగా హరిదాసు గౌరీశంకర్ వ్యవహరిస్తారు. మరో ఏడుగురిని గౌరవ సలహాదారులుగా ఎన్నుకున్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కళాకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం శాయశక్తులా పాటు పడుతుందని నూతన కార్యవర్గం ప్రకటించింది. అక్కడే ప్రమాణ స్వీకారం చేశారు.

ఇదిలాఉంటే పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎం.సత్యనారాయణశెట్టి ప్రమేయం లేకుండానే నూతన కమిటీ ఎన్నిక జరగటం విశేషం. ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు పేరిట సర్వసభ్య సమావేశం ప్రకటన విడుదల చేశారు. అందులో ఎలాంటి అజెండాను ప్రస్తావించలేదు. తీరా సమావేశానికి హాజరయ్యాక నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవటం విశేషం. కళాకారుల సంఘానికి అయిదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 2019లో ఎన్నికలు కూడా హోరాహోరీగా జరిగాయి. ఒకటి రెండు పర్యాయాలు వాయిదా కూడా పడ్డాయి. అప్పటి కార్యవర్గం కాలపరిమితి పూర్తయింది. అయినా పాలకవర్గం ఎన్నికలకు సమాయత్తం కావటం లేదు. దీనితో మిగిలినవారి ప్రోద్బలంతో ఈ సమావేశాన్ని, ఎన్నికలను నిర్వహించారు. అయితే అధ్యక్షుడి ప్రమేయం లేకుండా, అతడి పరోక్షంలో ఏకగ్రీవ ఎన్నిక ఏవిధంగా సబబని కొందరు ప్రశ్నించారు. దీనిపై కొంతసేపు వాగ్వాదం జరిగి. ఉద్రిక్తత నెలకొంది. ఈ పరిణామంతో కొందరు బయటకు వెళ్లిపోయారు. ఎన్నికల కారణంగా డబ్బు వృధాగా ఖర్చవుతోందని, ఏకగ్రీవంగా ఎన్నుకోవటం వల్ల ఆ డబ్బును కళాకారుల సంఘానికి వినియోగించవచ్చని సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఉజ్వల భవిష్యత్తుకు ఉన్నత విద్య ముఖ్యం



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఈవీ నారాయణరావు

తాడేపల్లి రూరల్ : ఉన్నత విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని కొండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, గౌడ జన సేవా సమితి ఫౌండర్, చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ రావు అన్నారు. ఆదివారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి గౌడ కల్యాణ మండపంలో ఎడ్యుకేషన్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ ఫర్ గౌడ్స్ (ఈసీజీ) ఆధ్వర్యంలో ఉన్నత విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈవీ నారాయణ రావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు పిల్లలు ఉన్నత చదువులతో ఎదగాలని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేలా స్ఫూర్తి గ్లోబల్ ఆర్గనైజేషన్, అమెరికా – ఈసీజీ సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ యం. శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకుని సాధించడానికి క్రమశిక్షణతో కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక సత్యనారాయణ, ఏపీ ట్రెజరీస్, అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ మేక శేషగిరిరావు, స్ఫూర్తి గ్లోబల్ ఆర్గనైజేషన్ ప్రతినిధి మరీదు శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ వాకా రాంగోపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డస్ట్ బిన్ ఏర్పాటు చేయరూ...



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కొండమెట్ల బజారు మూడు బొమ్మల సెంటర్లో స్థానికులు వ్యర్థాలు పారవేస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వస్తోంది. పారిశుద్ధ్య కార్మికులు మూడురోజుల కోమారు తొలగిస్తుండటంతో స్థానికులు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఇళ్లలోని చెత్తను తీసుకెళ్లేందుకు రిక్షాలు కూడా రాకపోవడంతో చెత్తను అక్కడ వేస్తున్నట్లు పరిసరాల ప్రజలు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో చెత్తకుండీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పైపులు దగ్ధం

పట్నంబజారు: గుంటూరు నగరంలో ప్లాస్టిక్ పైపులు అగ్నికి ఆహుతి అయిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపిన వివరాలు.. గుంటూరు నగరంలోని శివనాగరాజు కాలనీ సమీపంలో షాపుంజి పల్లంజి కంపెనీ యూజీడీ పనులకు సంబంధించి ప్లాస్టిక్ పైపులు రోడ్డుపై నిల్వ ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సమయంలో ఆ ప్లాస్టిక్ పైపులకు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రూ.మూడు లక్షల విలువ చేసే 300కు పైగా ప్లాస్టిక్ పైపులు అగ్నికి కాలిపోయాయి. అగ్నిప్రమాదానికి సంబంధించిన కారణాలు తెలియరాలేదు. మంటలు పెద్ద ఎత్తున చెలరేగటంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సిబ్బందితో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

హిందూ సేవా సమితి అన్నదానం



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని మహాకాళేశ్వర స్వామి ఆలయం వద్ద ముప్పాళ్ల మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన జైహనుమాన్ హిందూ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సేవాసమితి ఆధ్వర్యంలో నెలలో ఒకరోజు గ్రామాల్లోని ఆలయాల వద్ద అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాలంగా ఇలాటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, స్నేహితులమైన తాము తమ సంపాదనలో కొంత సేకరించి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సమితి సభ్యులు ఎస్. స్వామి, వై.శివ, టి. నరసింహారావు, ఆర్.రామయ్య, ఎస్, నారాయణ, పి. వెంకటరత్నం, బి.సాయి, ఎన్. విజయకుమార్, రామాంజి, వీరాంజి, టి. బ్రహ్మయ్య, ఎ.సాంబ తదితరులు పాల్గొన్నారు.

పరవశింపజేసిన అన్నమయ్య గానాలాపన



వేదికపై అన్నమయ్య కీర్తనల గానం

తెనాలి: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 616 వ జయంతి సందర్భంగా పట్టణ సాంస్కృతిక సంస్థ 'సంకీర్తన' ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనాలాపన సంగీతాభిమానులను పరవశింపజేసింది. స్థానిక కొత్తపేటలోని హోటల్ గ్రాండ్ అదితి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటైన సంగీత కార్యక్రమాన్ని శ్రీలత, దివ్యశ్రీలు విఘ్నేశ్వర ప్రార్థనతో ప్రారంభించారు. అనంతరం గాయని కొండిపి వసుంధర 'మూల మూల ముసు చల్ల' అనే అన్నమయ్య కీర్తనను శ్రావ్యంగా గానం చేశారు. 'ఏమని పొగుడుదు మె అలిమేలు మంగ' అనే కీర్తనను టీవీఎస్ శాస్త్రి మధురంగా గానం చేశారు. చిరంజీవి దేవీ లలిత 'శ్రీమన్నారాయణ, శ్రీమన్నారాయణ' కీర్తనను, డాక్టర్ కె.పురుషోత్తమరావు 'నారాయణతే నమో నమో' కీర్తనను ఆలపించారు. రత్నశ్రీ,, ఎం కార్తీక్, సుచరిత, పర్చూరు సుబ్బారావు, నరసింహారావు, శంకర్ రాజు పలు అన్నమయ్య కీర్తనలను గానం చేశారు. వీరికి గౌరవరుల అంజనేయ శాస్త్రి వయొలిన్, కానూరు వెంకట రామకృష్ణ మృదంగం, నాగు తబలా, వెంకటేశ్వరరావు కీబోర్డుపై వాద్య సహకారం అందించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు పర్యవేక్షించిన కార్యక్రమంలో సంకీర్తన సభ్యులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణానికి విగ్రహాలు తోడ్కొని వెళుతున్న అర్చకులు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్లోని సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక శ్రీ హనుమాన్ జన్మదిన వేడుకలు, 16వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. సాయంత్రం స్వామి వారికి పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, స్వామి వారికి విశేష పూజాది కార్యక్రమాలను చేశారు. వైదిక క్రతువును ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాస మూర్తి, కిరణ్, సురేష్, వైఖానస పండితులు నాగమారుతి ఆగమోక్తంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త ములుకుట్ల విశ్వనాథశర్మ సుందరకాండ విశిష్టతను వివరించారు. శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాస రెడ్డి, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవా సమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, గుంటి వెంకట్, దమ్మాల వెంకటేశ్వరరావు, ఆర్ సురేష్, ఎం వెంకటేష్, బి.లీలాప్రసాద్, గోలి సోమశేఖర్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌కు అధునాతన చికిత్సా విధానాలు

ప్రఖ్యాత అంకాలజిస్ట్ డాక్టర్ సత్యశ్రీనివాస్



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న డాక్టర్ సత్యశ్రీనివాస్, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: ప్రస్తుతం సమాజంలో ఈ క్యాన్సర్ వ్యాధి విస్తృతంగా వ్యాపిస్తోందని, దీనికి ముఖ్య కారణాలు జన్యుపరమైన కారణాలు, మనం అనుసరిస్తున్న జీవన శైలి అని ప్రఖ్యాత అంకాలజిస్ట్ సత్యశ్రీనివాస్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చాలామందిలో ధూమపానం, మద్యపానం, ప్యాసివ్ స్మోకింగ్, వివిధ రకాల రసాయనాలతో పండించిన కూరగాయలను పండ్లను వినియోగించటం వలన క్యాన్సర్ వస్తుందన్నారు. అదే విధంగా వివిధ ఆహార పదార్థాలలో రుచుల కొరకు ఉపయోగించే పదార్థాలను వివిధ ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా కనపడటానికి ఉపయోగించే కలర్స్, కెమికల్స్ కలపి తయారు చేసిన ఆహారం ఉత్పత్తులను తినడం ద్వారా క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. తొలి దశలో గుర్తిస్తే వందశాతం నయం చేయడానికి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మనకు రెండు భాగాలకు సంబంధించిన క్యాన్సర్లకు వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయని, అవి ఒకటి రంగుకు సంబంధించిన హెపటైటిస్ బి వ్యాక్సిన్ రెండోది సర్వైకల్ క్యాన్సర్ కు సంబంధించిన వ్యాక్సిన్ అని వివరించారు. ఈ రెండు రకాలకు తప్ప మన శరీరంలో వివిధ భాగాలకు సంభవించే క్యాన్సర్లకు వ్యాక్సిన్ లేదన్నారు. వాటి విషయంలో స్క్రీనింగ్ టెస్ట్‌ల ద్వారా కొన్ని సందర్భాల్లో తొలి దశలో గుర్తించవచ్చని తెలిపారు. ఈ స్క్రీనింగ్ టెస్ట్‌లలో వంద శాతం తెలిసే అవకాశం ఉండదని, జనరల్ చెకప్‌లలో ఏదైనా క్యాన్సర్ కు సంబంధించిన లక్షణాలు కనపడిన ఎడల తదుపరి పరీక్షలు పెట్ స్కాన్ లాంటివి, బయాప్సీ లాంటి పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నిర్ధారించి వైద్యం చేసే అవకాశం ఉందని వివరించారు. అనంతరం అవగాహన సీనియర్ సభ్యులు ఓ.చంద్రశేఖర రావు, ఏ రవీంద్ర కుమార్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు డాక్టర్ సత్య శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

ఎంపీలపై 46శాతం మందిపై క్రిమినల్ కేసులు

లక్ష్మీపురం: లోక్ సభ ఎన్నికల్లో ఎన్నికైన 543 మంది ఎంపీల్లో 250 మందిపై క్రిమినల్ కేసులు నమోదు అయినట్లు అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశి వరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి మాల్యాద్రి

లక్ష్మీపురం: చంద్ర రాజేశ్వరరావు నగర్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని నూతనంగా ఏర్పాటు అయిన ప్రభుత్వం శ్రద్ధ వహించి అభివృద్ధికి కృషి చేయాలని సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి కోరారు. స్థానిక చంద్ర రాజేశ్వరరావు నగర్‌లో కార్యదర్శుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో కనీసం సౌకర్యాలు కల్పనకు ప్రభుత్వం కృషి చేయలేదని నగర పాలక సంస్థ ఏర్పడిన తర్వాత కార్పొరేటర్ ఏమాత్రం అభివృద్ధికి సహకరించలేదని అన్నారు. కనీస సౌకర్యాలు అయిన విద్యుత్ మరుగుదొడ్లు డోర్ నంబర్లు కోసం సీపీఐ పోరాట ఫలితంగా ఏర్పాటు చేసుకోగలిగాం అన్నారు. నూతనంగా ఏర్పడబోయే ప్రభుత్వం అయినా పేద ప్రజలకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రధానంగా మెయిన్ రోడ్డు పనులు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం 15 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వారికి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని, సైడు కాలువలు ఏర్పాటు చేసి పక్కా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నగర కమిటీ సభ్యులు దేవనాయక్, రావుల అంజిబాబు, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, బోసు, హుస్సేన్ బి, మాలాలి పాల్గొన్నారు.